



ఆ రోజు ఆదివారం.

శెలవురోజు కాబట్టి తీరికగా మధ్యాహ్నం పన్నెండున్నరకి హోటల్‌కి బయల్దేరాను భోజనానికి. రోజూ నేను వెళ్ళే హోటల్‌కి కాక, కొద్దిగా ఖరీదయిన హోటల్‌కి వెళ్ళాను ఆ రోజు. నాంపల్లి ప్రాంతంలో వుందా హోటల్.

లోపలకి అడుగుపెట్టగానే, గుమ్మందగ్గరే నిలబడ్డాను కొద్దిక్షణాలు. ఖరీదయిన హోటల్‌కున్న వాతావరణంవల్ల లోపల బాగా డిమ్‌గా వెలుగుతున్నాయి లైట్లు. నా కళ్ళు ఆ కొద్దిపాటి చీకటికి అలవాటుపడ్డాక లోపలకి నడిచాను, ఖాళీ సీట్‌కోసం వెదుకుతూ.

మొదటి తారీఖు వచ్చిన తర్వాత వచ్చిన మొదటి ఆదివారం అది. ఆ ప్రభావంవల్లనుకుంటాను, లోపల రద్దీగా వుంది. ఖాళీ సీట్స్ ఎక్కడా లేవు. చివరిదాకా వెళ్ళి, మళ్ళీ వెనక్కితిరిగి గుమ్మంవైపు నడుస్తుంటే, అప్పుడే ఖాళీ అయిన రెండు సీట్లు నా కళ్ళబడ్డాయి.

ఆ బల్లదగ్గరకి నడిచాను. బల్లకి అటువైపు వున్న రెండు సీట్లలో ఇద్దరు దంపతులు కూర్చుని వుండటం గమనించి సంశయిస్తూ అక్కడే నిలబడ్డాను.

"క్షమించండి. నేను ఇక్కడ కూర్చుంటున్నాను" అన్నాను ఆయనతో.

నా వంక తేరిపార చూసాడతను.

"కూర్చోండి" అన్నాడు చిన్నగా మందహాసం చేసి.

కూర్చున్నాను.

భార్యతో ఏదో చెప్తున్నాడతను. నేను బేరర్‌కోసం కళ్ళతో వెదుకుతుండగా, అకస్మాత్తుగా, ఆతని కంఠం వినిపించింది నాకు.

"మీ పేరు....?"

చెప్పాను.

కొన్నిక్షణాల మౌనం తర్వాత అన్నాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసాను ఇంతకుముందు."

"యూనివర్సిటీలో పనిచేస్తున్నాను."

"అక్కడకాదు" అన్నాడు తల అడ్డంగా వూపుతూ.

"విద్యానగర్‌లో వుంటున్నాను."

మళ్ళీ తల అడ్డంగా వూపి అన్నాడు.

"ఊహూ, అక్కడకూడా కాదు."

"బహుశ బస్సుల్లో చూసి వుంటారు ఎక్కడయినా."

ఈసారి ఆవిడ మాట్లాడింది.

"మీకీ అలవాటు చస్తే పోదు."

"ఏ అలవాటు?" అడిగాను అప్రయత్నంగా, ఆవిడ కంఠంలోని చిరుకోపాన్ని గుర్తించి.

"ఎవరినయినా కొత్త వ్యక్తిని చూస్తే ఇలానే మాటలు కలుపుతారు ఈయన."

బేరర్ వచ్చాడు. మీల్స్ ఆర్డర్ చేసాను.

"నిజంగా మిమ్మల్ని ఈమధ్య ఎక్కడో చూసాను.... మీకీమధ్య ఏదైనా హాస్పిటల్‌లో ఆపరేషన్‌లాంటిది జరిగిందా?" అడిగాడు.

"లేదు."

"గుర్తొచ్చింది. సారీ. నెలక్రితం అనుకుంటాను.... కాదు. రెండు నెలలు దాటి వుంటుంది. మీ పోలికలున్న ఒక వ్యక్తికి అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది మారేడ్‌పల్లిలోని ఓ హాస్పటల్‌లో."

"మీరు డాక్టరా?" అడిగాను.

తలవూపి చెప్పాడు. "అవును. ఎనస్తీషియన్‌ని. ఆ ఆపరేషన్‌కిముందు ఆ పేషెంట్‌కి నేనే అనస్తీషియా ఇచ్చాను."

"నాకెప్పుడూ అపెండిసైటిస్ రాలేదు" అన్నాను నవ్వి.

"వెరీసారీ. ఆ పేషెంట్‌కి అచ్చం మీ పోలికలే వున్నాయి. ముఖ్యంగా బట్టతల అలాగేవుంటుంది."

నవ్వి వూరుకున్నాను.

కాసేపు మౌనంగా వుండిపోయాడు డాక్టర్. నలభై అయిదుదాకా వుంటా యతనికి. పచ్చగా, దబ్బపండులా వున్నాడు. నల్లటి ఫ్రేమ్‌లో బంధింపబడ్డ టింటెడ్ కళ్ళద్దాలు హుందాతనాన్ని ఇస్తున్నాయి ఆయన పర్సనాలిటీకి. విటమిన్ టేబ్స్, టానిక్స్ తీసుకోవటం అలవాటనుకున్నాను, ఆయన మొహంలో కనబడే చురుకుదనం, ఆరోగ్యం చూసి.

బేరర్ మీల్స్ ప్లేట్ తీసుకువచ్చాడు.

"ఎవరిని చంపారు?" అకస్మాత్తుగా ఆవిడ అడిగింది డాక్టర్‌ని.

తలెత్తి చూసాను డాక్టర్ వంక. ఆయన మొహంలో చిరునవ్వు తొణికిసలాడింది.

"ఎవరిని చంపాననుకుంటున్నావు?"

"మీరే చెప్పాలి."


"ఎవరో ఒకరు చావాల్సిందేగా."

పెదవి విరచింది ఆవిడ.

ఆ సంభాషణ వాళ్ళిద్దరిమధ్యా సాగుతోంది, కొద్దిగా తగ్గు స్వరంలో, నేను రాకముందు మాట్లాడుకుంటున్న సంభాషణ కొనసాగిస్తున్నారని అర్థమైంది నాకు.

"అబ్బ! అలాంటి పరిస్థితివస్తే ఘోరం కదా?" అన్నది ఆవిడ.

"డాక్టర్‌లకి ఒకోసారి అలా జరిగిపోతుంటుంది. అనవసరంగా త్రివేణి జీవితం ఇరుకున పడుతుంది. ఆలోచించే వ్యవధి




"కూడా వుండదు." కొన్ని క్షణాల తర్వాత అన్నాడు ఆలోచనగా. "చంపేసానంతే."

అన్నం కలుపుకోవటం ఆపి అడిగాను ఆశ్చర్యంగా.

"మీరు చంపేసారా ఎవరినయినా?"

నా ప్రశ్న విని వాళ్ళిద్దరూ ఒకసారి ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

డాక్టరే సర్దుకుని అన్నాడు నవ్వి. "అవును. ఒకరిని చంపాను."

"మనిషినే?"

"అక్షరాలా మనిషినే. నా పేషెంట్లలో ఒకరిని."

"పొరపాటున ఏ కత్తెరో కడుపులో వుంచేసి కుట్టేసారా?" అడిగాను నవ్వుతూ.

ఆయన నా కళ్ళలోకి మొదటిసారిగా చూస్తూ అన్నాడు.

"పొరపాటున కాదు. కావాలని, చూస్తూ, చూస్తూనే చంపాల్సి వచ్చింది."

ఈసారి ఆయన స్వరంలో మార్పు వుంది. ఇదివరలా మామూలుగా లేదు. ఆ భావానికి తెలుగులో సరయిన పదం లేదనుకుంటాను. భయంకరంగా లేదు అలా అని మెత్తగా కూడా లేదు.

"కావాలని హత్యచేసాను" అదే స్వరంతో మళ్ళీ చెప్పాడాయన. క్షణాలలో సీరియస్ అయిపోయాడు. అతని ప్రక్కన కూర్చున్న ఆవిడ మొహంలోకి కూడా సీరియస్‌నెస్ ప్రవేశించింది.

కాసేపు నాకేం మాట్లాడాలో తెలియలేదు.

"ఛ. మీరు అలా కనబడరు." అన్నాను పెగుల్చుకొని.

"ఒక్క నేనేకాదు. ఆ పరిస్థితుల్లో ఏ డాక్టరున్నా తప్పకుండా హంతకుడయి వుండేవాడు."

"మీ కభ్యంతరం లేకపోతే ఎవరిని చంపారో చెప్పండి" అన్నాను.

"నిజానికి ఆ హత్య చేయటంలో కూడా నాకు ఛాయస్ దొరికింది. ఇద్దరు వ్యక్తులలో ఒకరిని తప్పక చంపాల్సిన పరిస్థితి ఏర్పడింది నాకు.''

"చట్టబద్ధంగానా?" అడిగాను.

క్రమంగా ఆయన మొహంలో సీరియస్‌నెస్ మబ్బుల్లా విడిపోయింది. చిన్నగా నవ్వి అన్నాడు.

"అవును. చట్టబద్ధంగానే."

"త్రివేణి ఎవరు?" అడిగాను.

"త్రివేణి ఎవరు అన్న ప్రశ్నకి సమాధానం చెప్పాలంటే, మీకు మొదటినుంచీ చెప్పాలి జరిగిందంతా."

"మీ కభ్యంతరం లేకపోతే దయచేసి చెప్పండి. అభ్యంతరం వున్నా కూడా చెప్పండి. పూర్తిగా తెలుసుకోకపోతే నాకు ఈ సంఘటన ఇలాగే గుర్తుండిపోతుంది చాలా కాలం. ఎవరిని ఎందుకు మీరు మీ మెడికల్ కెరీర్‌లో చంపాల్సి వచ్చిందోనన్న సంశయం నాలో మిగిలిపోతుంది. కాబట్టి మీరు చెప్పాల్సిందే."

డాక్టర్ నవ్వి, బేరర్ తెచ్చిన ప్లేట్‌లోంచి రూపాయ కాగితాలు తీసుకున్నాడు. చిల్లర టిప్‌గా వదిలి.

"కాఫీ, ఐస్‌క్రీమ్ ఏం కావాలంటే అది తీసుకోండి. ఊరికే కూర్చుంటే విసుగు పుడుతుంది" అన్నాను.

డాక్టర్ భార్య చిన్నగా నవ్వి అన్నది.

"నో థాంక్స్. వి హేవ్ జస్ట్ ఫినిష్డ్."

నేను భోజనం చేయసాగాను. డాక్టర్ సిగరెట్ వెలిగించి చెప్పాడు.

"నెల్రక్రితం జరిగిందీ సంఘటన."

"మీరు హత్య చేయాల్సివచ్చిన రోజా?"

"అవును. మార్చి మూడు. నాకు తారీకు కూడా గుర్తుంది."

"చెప్పండి."

"నాకు ప్రయివేట్ నర్సింగ్‌హోం వుంది సిద్ధీపేట్‌లో. నేను పుట్టి పెరిగింది సిద్ధీపేట్‌లోనే. నెలలో పదిహేను రోజులు అక్కడ నర్సింగ్‌హోంలో ఉంటాను. మిగతా పదిహేను రోజులు హైద్రాబాద్‌లో ఉంటాను. హైద్రాబాద్‌నుంచి కరీంనగర్ వెళ్ళే దారిలో వుంది మా వూరు" అని ఆగాడు.

"నా కా రూట్‌తో అట్టే పరిచయంలేదు. ఎప్పుడూ అటువైపు వెళ్ళలేదు" అన్నాను.

"మార్చి రెండు తెల్లవారుఝామున నర్సింగ్‌హోంనుంచి కబురు వచ్చింది నాకు. ఫోన్‌లో చెప్పింది డ్యూటీలో వున్న నర్స్ సీరియెస్ కేస్ వచ్చిందనీ, వెంటనే నన్ను బయలుదేరమనీ.

నర్సింగ్‌హోం ఇంటికి దగ్గరే. అయిదు నిముషాల తర్వాత చేరుకున్నాను.

సిగరెట్ ఆర్పేసాడు డాక్టర్. మాట్లాడుతూ, మాట్లాడుతూ మధ్యలో ఏదో ఆలోచిస్తూ ఆగిపోవటం డాక్టర్‌కి అలవాటని గ్రహించటంవల్ల నేను మళ్ళీ ఎప్పుడు మాట్లాడుతాడా అని చూస్తూండిపోయాను, భోజనం ముగిస్తూ.

గొంతు సర్దుకుని చెప్పాడు.

"కరీంనగర్ నుంచి హైద్రాబాద్ వెళ్ళే టాక్సీ కొకదానికి ప్రమాదం జరిగింది సిద్ధీపేట్ పొలిమేరల్లో. ఎద్దుబండీ కొకదానికి గుద్దుకుని టాక్సీలో ప్రయాణిస్తున్న నలుగురికీ తీవ్రంగా దెబ్బలు తగిలాయి. ఇద్దరి పరిస్థితి మరీ ప్రమాదంగా వుంది.

డ్యూటీ నర్స్ లోపలికి తీసుకెళ్ళింది నన్ను. ఇద్దరికి చేతులూ, కాళ్ళు ఫ్రాక్చర్ అయాయి. నర్స్ మార్ఫియా ఇచ్చింది

వాళ్ళకీ, బాధ భరించలేరని. ఫ్రేక్చర్ అయిన గుర్తుగా కాళ్ళు బాగా వాచాయి. అంతకు మించి ఏంకాలేదు. క్రమంగా కోలుకుంటారు వాళ్ళు.

మిగతా ఇద్దరికీ గాయాలయాయి. దాదాపు ఏభై ఏళ్ళున్న ఒకతనికి నుదురు పగిలింది. నర్స్ మొహం తుడిచినా, ఇంకా ఎర్రగానే వుంది మొహం నెత్తురుతో తడిసిపోవటం వల్ల.

రెండో ఆతనికి వీపులో గాయం అయింది. విపరీతంగా రక్తం కారిపోయింది అతనికి కూడా. ముప్పై లోపుంటాయి వయసికి. నర్స్ వాళ్ళ గాయాలకి డ్రస్ చేసింది. వాళ్ళు బ్రతకాలంటే ముందర ఇద్దరికీ రక్తం ఎక్కించటం అవసరం.

నర్స్ బ్లడ్ సేంపుల్స్ తీసుకుంది. ఇద్దరం చెరో సేంపుల్‌తో లేబరెటరీలోకి నడిచాం, వాళ్ళ బ్లడ్ గ్రూప్ కనుక్కోడానికి." భార్య నా వంక చూసాడు విసుగు పుడుతోందా అన్నట్లుగా.

"చెప్పండి" అన్నాను.

నా వుత్సాహం గమనించి మళ్ళీ చెప్ప సాగాడు డాక్టర్.

"ఇద్దరి రక్తం ఒకే గ్రూప్‌కి చెందింది. 'బి ఓ' గ్రూప్‌కి చెందిన రక్తం వాళ్ళిద్దరిదీ. దురదృష్టవశాత్తు కథల్లోలాగా 'బిఓ' రకానికి చెందిన రక్తం నావద్ద లేకపోయింది."

"ఏంచేసారు?" అడిగాను ఆయన చాలా సేపు మౌనంగా వుండిపోవటంవల్ల.

"నలుగు రైదుగురు తెలిసిన ఇతర డాక్టర్లకి ఫోన్ చేసానుకాని ఆ రక్తం ఎవరివద్దా లేకపోయింది మళ్ళీ కథల్లో లాగానే."

"రక్తం లేక వాళ్ళు చచ్చిపోతే మీరు హంతకులెలా అవుతారు? అది మీ తప్పు కాదుగా?"

"ఒకరి మనీపర్స్‌లో, సిద్ధిపేట్‌లోని త్రివేణి అన్న వ్యక్తిపేరు, ఇంటి అడ్రసునామా వ్రాసివున్న కాగితం వుంది. వెంటనే మనిషిని పంపాను త్రివేణి దగ్గరకి. పావు గంటలో వచ్చింది. పేషెంట్‌ని చూపించాను. ఆ అమ్మాయిని పట్టలేకపోయాం అరగంటదాకా, మైల్డ్‌గా పనిచేసే స్లీపింగ్ టేబ్లెట్ ఇచ్చాను టెన్షన్ తగ్గాలని."

"ఆ అమ్మాయి భర్తా?"

"అవును. ఒకతను భర్త. వేరొకతను తండ్రి."

"సీరియెస్‌గా వున్న ఆ ఇద్దరి పేషెం




ట్లలో ఒకరు త్రివేణికి భర్త, ఒకరు తండ్రా?"

"ఎగ్జాట్లీ. త్రివేణి కడుపుతో వుంది. నాలుగో నెల."

"పిటీ."

"త్రివేణి రక్తం పరీక్షించాను. ఆమె రక్తం 'బి ఓ' గ్రూప్‌కి చెందింది."

"మై గుడ్‌నెస్. తర్వాత?"

"అన్నం తినండి" అన్నాడు డాక్టర్ నవ్వి. చెప్పసాగాడు.

"ఆ అమ్మాయివున్న పరిస్థితినిబట్టి నిజానికి రక్తం తీసుకోకూడదు. కాని అత్యవసర పరిస్థితి కాబట్టి ఆ అమ్మాయినుంచి రక్తం తీసుకోదలిచాను. అందుకు త్రివేణి సమ్మతించింది. తన గర్భం పోయినా ఫర్వాలేదని అంగీకరించింది."

డాక్టర్ భార్య నా మొహంవంక చూస్తూ వింటోంది.

"చిన్న చిక్కు వచ్చిపడింది. వేరే బాటిల్ లోకి త్రివేణి రక్తం తీసుకుని, మళ్ళీ ఆ బాటిల్‌లోంచి పేషెంట్‌కి ఎక్కించేంత వ్యవధిలేదు. కాబట్టి డైరెక్ట్‌గా ఆమె రక్తనాళంలోంచి రక్తాన్ని పేషెంట్‌కి ఎక్కించ దలిచాను. అందుకు ఏర్పాట్లు జరిగిపోయాయి వెంటనే."

"కరీంనగర్‌నుంచి హైద్రాబాద్ వెళ్తూంటే ఈ ఏక్సిడెంట్ జరిగిందన్నారు. అసలా పేషెంట్స్‌ది ఏ వూరు?"

"త్రివేణి పుట్టిల్లు కరీంనగర్. భర్త సిద్దీపేట్‌లో పనిచేస్తున్నాడు. ఆ ముందురోజే మామగారింటికి వెళ్ళాడు. ఏదో పనిమీద హైద్రాబాద్ అర్జెంట్‌గా బయల్దేరారుఇద్దరు."

"ప్లీజ్ కేరీ ఆన్."

"అన్నిటికన్నా పెద్ద విషాదం, త్రివేణి నుంచి నేను కేవలం ఒకే ఒక పేషంట్‌కు సరిపడ రక్తం మాత్రమే తీసుకోవలసి రావటం. ఆ రక్తం కూడా ఒక పేషెంట్‌కి పూర్తిగా సరిపోకపోయినా ప్రమాదం తప్పిస్తుంది."

"బేడ్‌లక్."

"వెరీ బేడ్ లక్. నాకేకాదు. ఆ పేషెంట్స్ నిప్పుడు త్రివేణికి సంగతి చెప్పి వారిద్దరిలో ఎవరికి ఆ రక్తం దానం చేస్తుందో చెప్పమని కోరాను. ఎవరికి ఆ రక్తం ఇవ్వదలచుకుంటే, ఆ పేషెంట్‌ని సిద్ధం చేయాలని చెప్పాను."

"గుడ్ గాడ్."

"దేముడెప్పుడూ మంచివాడు కాదు కష్టాలలో వున్న మనిషికి. ఒక కష్టంమీద మరో కష్టం కలిగించి, చూసి, సంతోషపడతాడు. గాడ్ ఈజ్ నెవర్ గుడ్."

"త్రివేణి ఏమంది?"

"ఈసారి గుండె దిటవుచేసుకుని చెప్పింది"

"భర్తా?"

"ఏమిటి భర్తా?"

"రక్తదానం చేయడానికి ఎన్నుకుంది."

"తండ్రెందుకు కాకూడదు?" ఎదురుప్రశ్న వేసాడు డాక్టర్.

"తండ్రా అయితే?"

"భర్త మరణిస్తే ఇక త్రివేణి బ్రతుకు ఏమవాలి? పాతికలోపే త్రివేణి వయసు."

"ఎవరిని ఎన్నుకుంది?"

"ఎవరి ఎన్నుకుంటుందని మీ వూహ?"

"చెప్పలేను. నాకు త్రివేణితో బాగా పరిచయం వుంటే చెప్పగలిగేవాడినేమోగాని, ఆ అమ్మాయిని చూడనైనా చూడకుండా ఎలా చెప్పగలను?"

"తనకి తెలియదంది."

"ఏం చేసారు?"

"మీ ఇష్టం నాకు ఇద్దరు కావాల్సిన వ్యక్తులే. ఎవరిని వదులుకోడానికి నాకు మన స్కరించదు. నాకు చెప్పకండి. వాళ్ళిద్దరిలో మీఇష్టంవచ్చిన వాళ్ళని మాత్రం తప్పకుండా, ఎలాగైనాసరే, ఆఖరికి నా ప్రాణాలు పోయిన సరే, ఒక్కరినైనా తప్పకుండా బ్రతికించండి అన్నది.

"త్రివేణి కళ్ళకి గంతలు కట్టాను.చెవుల్లో దూదిపెట్టాను. ఎవరికి తన రక్తం యివ్వబడు

తుందో త్రివేణికి తెలిసే అవకాశం లేకుండా చేసి, ఒక పేషెంట్‌ని బ్రతికించాను."

"లేదు. ఒక పేషంట్‌ని చంపారు" అన్నది డాక్టర్ భార్య.

"తప్పలేదు" అన్నాడు డాక్టర్.

"ఎవరిని బ్రతికించారు?" అడిగాను.

"ఎవరిని చంపి వుంటానని అనుకుంటున్నారు"

"ఆ ఇద్దరిలో ఎవరినయినా కావచ్చు. ఎవరిని తండ్రా? భర్తా?" డాక్టర్ సమాధానం చెప్పకుండా చిరునవ్వు నవ్వి అన్నాడు.

"ఇవతల ఒక పేషెంట్‌కి రక్తం ఎక్కిస్తుండగానే రెండో పేషెంట్ మరణించాడు. కొద్దిగా ఆలస్యం అయినా ఆ రెండటి పేషెంట్ కూడా చచ్చిపోయేవాడు. ఆ మనీపర్స్‌లోని ఆ చిరునామా కాపాడింది అతన్ని".

"త్రివేణి భర్తనా?"

సమాధానం చెప్పలేదు డాక్టర్.

"తండ్రినా!"

మౌనంగా వుండిపోయాడు.

"ఎవరిని?" మళ్ళీ అడిగాను.

డాక్టర్ లేచి నిలబడ్డాడు, డాక్టర్ భార్య కూడా వెంటనే లేచి నిలబడింది.

"వెళ్తున్నారా?" అడిగాను.

"అవును."

"మీరు చెప్పనేలేదు?"

"చెప్పను."

"చెప్పరా?" ఆశ్చర్యంగా అడిగాను. "ఇందులో రహస్యంగా వుంచాల్సినంత ముఖ్యమయిన సంగతి ఏముంది?"

"ఉంది. చెప్పకపోతే మీను, ఈ రోజు, త్రివేణి, ఆ ఎక్సిడెంట్, 'బి' గ్రూప్ రక్తం ఇలా చాలా గుర్తుండిపోతాయి మీకు చాలా కాలం. చెప్పేస్తే ఆ ఎఫెక్ట్ వుండేరు."

నేనేం అనేది వినిపించుకోకుండా బయటికి నడిచారు ఇద్దరు గబగబా. నా భోజనం అయిపోవటంవల్ల నేను లేచి వాషింగ్ బేసిన్ వైపు నడిచాను. డాక్టర్ చెప్పిన వాటి గురించి ఆలోచిస్తూ.

భర్తని కాపాడి వుంటాడు. లేదా తండ్రిని. నవ్వొచ్చింది నాకు. ఆడపిల్ల. తప్పితే మొగపిల్లాడు ఖాయంలా వుంది నా ఆలోచన.

చెయ్యి కడుక్కుని, బిల్ చెల్లించి, బేరర్ ప్లేట్‌లో పెట్టి తెచ్చిన కిళ్ళీ వేసుకుని బయటికి నడిచాను. హోటల్ బయట వున్న పుస్తకం షాప్‌లోంచి ఓ పుస్తకం కొనుక్కుని పార్క్ చేసి వున్న ఓ అంబాసిడర్ కారువైపు నడు




స్తున్నారు డాక్టర్ దంపతులు.

నేను అనుకోని సంఘటన ఎదురయింది అకస్మాత్తుగా. హోటల్‌లోకి నడిచి వస్తున్నారు ఓ జంట పాతికేళ్ళలోపుండే అమ్మాయి. ఆ ప్రక్కనే చెయ్యిపట్టుకుని నడుస్తున్న ఓ ముప్పై ఏళ్ళ యువకుడు.

వాళ్ళు డాక్టర్‌ని చూసి పలకరించారు ఆగి.

"ఏం త్రివేణీ? కులాసానా?" డాక్టర్ భార్య ఆ అమ్మాయిని పలకరించింది వాత్సల్యంగా.

ఆ అమ్మాయి త్రివేణి—జవాబు చెప్పింది ఆ ప్రశ్నకి.

"మా ఇంటికి రేపు రాత్రి డిన్నర్‌కిరండి." డాక్టర్ ఆహ్వానించాడు వాళ్ళని.

"మేం చాలా కాలంగా అడుగుతున్నది. చెప్తానంటేనే వస్తాం".

"తప్పకుండా అన్నట్లు, అమ్మాయ్ ఈసారి నీ పేరే పెడుతున్నాను."

ఒకటి రెండు నిముషాల తర్వాత డాక్టర్ దంపతులు కారులో వెళ్ళిపోయారు.

త్రివేణి భర్త గమనించాడు. నేను చాలా సేపటినుంచి అతన్ని చూసే చూపులో ఆశ్చర్యం, అద్భుతంలాంటి భావం వున్నాయని. అతను నా దగ్గర ఆగి అడిగాడు.

"ఏమిటలా చేస్తున్నారు?"

"కంగ్రాచ్యులేషన్స్. డాక్టర్ నాకంతా చెప్పారు." అన్నాను చెయ్యిచాపి.

"థాంక్స్. కాని దేనికి?" అన్నాడు త్రివేణి భర్త నవ్వుతూ నా చేతిని అందుకుని.

"మీరు త్రివేణి కదూ!" అడిగాను.

"నా పేరు త్రివేణి" జవాబు చెప్పింది అయిష్టంగా.

"డాక్టర్ మీ భర్తని బ్రతికించటం నిజంగా మీ అదృష్టం" అన్నాను. ఆ అమ్మాయి జీవితంలో జరిగిన ఒక అపూర్వ సంఘటన నాకు తెల్సన్న గర్వం నన్నలా మాట్లాడించింది అనుకుంటాను వాళ్ళతో.

"మీరేం అంటున్నారో నా కర్థం కావటం లేదు."

"ఇప్పుడు మిమ్మల్ని పలకరించిన డాక్టర్ నాకంతా చెప్పారు" నవ్వాను. "మీ తండ్రి గారు మరణించడం దురదృష్టం".

ఒకసారి ఇద్దరు ఒకరివంక మరొకరు చూసుకున్నారు.

"ముమ్మాటికీ కాదు. నన్ను ఆ డాక్టర్ బ్రతికించడం శుద్ధ అబద్ధం అన్నాడు.

ఏడెనిమిదడుగులు ముందుకు వేసి ఆగి అన్నాడు త్రివేణి భర్త మళ్ళీ చిరునవ్వుతో. ఏదో అర్థమయినట్లుగా.

"ఆయన కేవలం డాక్టరే కాదు. గొప్ప రచయితకూడా ఇప్పుడే చెప్పారు ఆయన వ్రాసే కథలోని ఓ పాత్ర పేరు త్రివేణి అని.

హోటల్‌లోకి వెళ్ళిపోయారు ఇద్దరూ.

